# శ్రీ శ్రీ చెంగాలమ్మ మాత పరమేశ్వరి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తిరుమూరు సుధాకర్ రెడ్డి



**సూళ్లూరుపేట,పెన్‌పవర్, ఆగష్టు 5:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, సూళ్లూరుపేటలోని శ్రీ శ్రీ శ్రీ చెంగాలమ్మ మాత పరమేశ్వరి దేవస్థానం అభివృద్ధి కమిటీ (ట్రస్ట్ బోర్డు) నూతన చైర్మన్‌గా సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సూళ్లూరుపేట శాసనసభ్యురాలు పసిం విజయశ్రీ, పూర్వ శాసనసభ్యులు నెలవల సుబ్రహ్మణ్యం ఆశీస్సులతో ఆయనకు ఈ బాధ్యతలు దక్కాయి.

**ఘనంగా ప్రమాణ స్వీకార మహోత్సవం :** ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం జరిపింది. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం అందించారు.

**నాయకుల ఆశీస్సులకు ధన్యవాదాలు :** బాధ్యతల స్వీకరణ అనంతరం తిరుమూరు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పవిత్ర బాధ్యతను అప్పగించిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే శ్రీమతి నెలవల.విజయశ్రీకి, సీనియర్ నాయకులు నెలవల సుబ్రహ్మణ్యంకి, పార్టీ అధిష్టానానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆలయాభివృద్ధే ధ్యేయం అమ్మవారి కృపాకటాక్షాలతో ఆలయ సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నూతన చైర్మన్ స్పష్టం చేశారు. దాతల సహకారం, ప్రభుత్వ మద్దతుతో ఆలయ పరిసరాలను మరింత సుందరీకరించడం. ?దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన లైన్లు, వసతి, ప్రసాద వితరణలో మెరుగైన సౌకర్యాలు కల్పించడం. ?రాబోయే ఉత్సవాలను, ఆధ్యాత్మిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించడం జరుగుతుంది అని తెలియజేసారు. ?ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకులు, కార్యకర్తలు, ఆలయ అధికారులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిరుమూరు సుధాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# 250వ రోజుకు చేరిన గూడూరు జిల్లా సాధన రిలే దీక్షలు

## గూడూరును జిల్లా చేయాలని ఫ్లకార్డులతో నిరసన




**గూడూరు, పెన్ పవర్,ఆగస్టు 5 :** గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు బుధవారం 250వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు స్థానికులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాల ప్రతినిధులు దీక్షల్లో పాల్గొని ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా భారత్ వికాస్ పరిషత్ సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచల్ నాయుడు మాట్లాడుతూ, గూడూరును జిల్లా చేయాలనే ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. 250 రోజులుగా నిరంతరాయంగా రిలే దీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం గూడూరును జిల్లా చేయాలంటూ ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు ప్రజలు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.

# యెమెన్ దేశం నుండి విరూపాక్షపురం పక్షవాత నివారణ ఆయుర్వేద కేంద్రానికి రోగి

## సంప్రదాయ ఆయుర్వేద వైద్యానికి అంతర్జాతీయ ఆదరణ..



**పలమనేరు,పెన్ పవర్,ఆగస్టు 05 :** పలమనేరు నియోజకవర్గంలోని విరూపాక్షపురం గ్రామంలో ఉన్న సంప్రదాయ ఆయుర్వేద పక్షవాత నివారణ వైద్య కేంద్రానికి విదేశాల నుంచి కూడా రోగులు తరలివస్తుండటం విశేషంగా నిలుస్తోంది. ఎన్నో దశాబ్దాలుగా పక్షవాత బాధితులకు ఆయుర్వేద పసరు మందుతో చికిత్స అందిస్తూ విశేష గుర్తింపు పొందిన వైద్య నిపుణులు మోహన్‌రావు, ఆయన కుమార్తె డాక్టర్ అశ్విని ఆధ్వర్యంలో ఈ సేవలు కొనసాగుతున్నాయి. ఈ ఆయుర్వేద వైద్య కేంద్రంలో ఇప్పటివరకు వేలాది మంది పక్షవాత బాధితులు చికిత్స పొంది సాధారణ జీవితంలోకి తిరిగి వచ్చినట్లు స్థానికులు, రోగులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి మాత్రమే కాకుండా విదేశాల నుంచి కూడా రోగులు వచ్చి చికిత్స పొందడం ఈ కేంద్రానికి ఉన్న విశ్వసనీయతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం యెమెన్ దేశానికి చెందిన ఓ కుటుంబం విరూపాక్షపురంలోని ఆయుర్వేద కేంద్రాన్ని సందర్శించింది. పక్షవాత సమస్యతో బాధపడుతున్న కుటుంబ సభ్యుడికి సంప్రదాయ ఆయుర్వేద వైద్యం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, అనేక ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆశించిన ఫలితం రాలేదని,విరూపాక్షపురం ఆయుర్వేద వైద్యం గురించి పలువురి ద్వారా తెలుసుకుని ఎంతో నమ్మకంతో ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.ఇక్కడ అందిస్తున్న చికిత్సతో తమ ఆరోగ్యం మెరుగుపడుతుందనే పూర్తి విశ్వాసం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అశ్విని మాట్లాడుతూ..తమ తాత,తండ్రి మోహన్‌రావు అందించిన సంప్రదాయ ఆయుర్వేద వైద్య సేవలను వారసత్వంగా కొనసాగించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. పక్షవాతంతో నిస్సహాయ స్థితిలో వచ్చిన రోగులు కోలుకుని తిరిగి నడుస్తూ,ఆనందంగా తమను ఆశీర్వదిస్తూ వెళ్లడం కన్నా గొప్ప సంతృప్తి మరొకటి ఉండదన్నారు.ఎలాంటి ప్రచారానికి ఆశపడకుండా సేవాభావంతో ప్రజలకు ఆయుర్వేద వైద్యం అందించడం తమ కుటుంబ లక్ష్యమని, భవిష్యత్తులో కూడా మరింత మంది పక్షవాత బాధితులకు అందుబాటులో ఉండేలా సేవలను విస్తరిస్తామని వెల్లడించారు.వైద్యరంగంలో ఆధునిక చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నప్పటికీ, సంప్రదాయ ఆయుర్వేద వైద్యంపై ప్రజల్లో నమ్మకం రోజురోజుకూ పెరుగుతుండటం విశేషం. ముఖ్యంగా విరూపాక్షపురం ఆయుర్వేద పక్షవాత నివారణ కేంద్రానికి దేశ విదేశాల నుంచి రోగులు రావడం,ఈ వైద్య విధానానికి లభిస్తున్న ఆదరణకు నిదర్శనంగా పలువురు అభిప్రాయపడుతున్నారు.

# బీసీ రక్షణ బిల్లు-2026పై సమన్వయ సమావేశం

## విజయవాడలో ప్రజాప్రతినిధులతో ప్రభుత్వం విస్తృత చర్చలు

## పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు



**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 05 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముసాయిదా ఆంధ్రప్రదేశ్ బీసీ రక్షణ బిల్లు-2026పై సమన్వయ సమావేశం బుధవారం విజయవాడలోని ఫార్చ్యూన్ మురళి పార్క్ హోటల్‌లో నిర్వహించింది. బిల్లును తుది రూపు దిద్దే ముందు ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలు సేకరించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవితతో పాటు మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు, శాసనసభ బీసీ సంక్షేమ కమిటీ సభ్యులు, వెనకబడిన తరగతులకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. నరసరావుపేట శాసనసభ్యులు, శాసనసభ బీసీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు కూడా సమావేశంలో పాల్గొన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి (టీడీపీ--జనసేన--బీజేపీ) ఇచ్చిన హామీల్లో భాగంగా రాష్ట్రంలోని 138 బీసీ కమ్యూనిటీల హక్కులు, ఆత్మగౌరవం, ఆస్తులు, జీవితాలకు చట్టపరమైన రక్షణ కల్పించాలనే లక్ష్యంతో ఈ బిల్లును ప్రభుత్వం రూపొందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం తరహాలో బీసీలకు ప్రత్యేక రక్షణ కల్పించే చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ చట్టం అమల్లోకి వస్తే దేశంలో ఇలాంటి చట్టాన్ని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవనుంది. ముసాయిదా బిల్లులో కులం లేదా సంప్రదాయ వృత్తి పేరుతో అవమానించడం, వేధించడం, సామాజిక లేదా ఆర్థిక బహిష్కరణ వంటి 15 రకాల అఘాయిత్యాలను శిక్షార్హ నేరాలుగా చేర్చే ప్రతిపాదనలు ఉన్నాయి. నేర తీవ్రతను బట్టి ఆరు నెలల నుంచి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అంశాలను కూడా ముసాయిదాలో పొందుపరిచినట్లు సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీఓఎం), మంత్రివర్గ ఉపసంఘం పలుమార్లు సమావేశమై ముసాయిదాను రూపొందించగా ఇటీవల న్యాయశాఖ కూడా దీనిపై తన అభిప్రాయాన్ని వెల్లడించింది. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా ముసాయిదా ఉందని పేర్కొంటూనే అవసరమైన అంశాలపై జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ అభిప్రాయాన్ని కూడా తీసుకోవాలని సూచించినట్లు సమావేశంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేసిన అనంతరం బిల్లుకు తుది రూపు ఇచ్చి, రానున్న శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం, జాతీయ బీసీ కమిషన్‌కు పంపనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. బీసీ వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక భద్రతకు చట్టబద్ధమైన రక్షణ కల్పించే దిశగా ప్రభుత్వం విస్తృత స్థాయిలో సంప్రదింపులు కొనసాగిస్తోందని సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# డెయిరీ వ్యర్థాలతో కలుషితమవుతున్న నీరు

## గ్రామాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్న పరిస్థితి

## సిపిఎం బృందం పరిశీలనలో ప్రజల వెల్లడి



**పలమనేరు, పెన్ పవర్, ఆగస్టు 05 :** పట్టణానికి సమీపంలో ఉన్న పరాగ్ డైరీ నుండి విడుదల చేస్తున్న వ్యర్థాల వలన చుట్టుపక్కల ప్రజలు త్రాగునీరు కలుషితమై ఇబ్బందులు పడుతున్నట్లు బుధవారం సిపిఎం బృందం పరిశీలనలో ప్రజలు తమ గోడు వెలిబుచ్చారు.పరిశీలిన అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో అనేక పరిశ్రమలు నుండి విడుదలవుతున్న వ్యర్థాల వలన చుట్టుపక్కల ప్రజలకు త్రాగునీరు కలుషితమై రకరకాల అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. పలమనేరు సమీపంలో ఉన్న పరాగ్ పాల డైరీ విడుదల చేస్తున్న వాటర్ను శుద్ధి చేసి బయటకు పంపాలి, అలా కాకుండా పక్కనున్న కాలువలో అలాగనే వదిలేయడంతో కలుషితమైన నీరు వలన వ్యవసాయ బోర్లు నీరు ,త్రాగునీరు కలుషితమవుతున్నాయని త్రాగడానికి పనికి రావడం లేదని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.గతంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు దీనిపై ఆందోళన చేసిన పరిస్థితి కూడా ఉంది. ఆ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు డైరీ నుండి త్రాగునీటి సౌకర్యాన్ని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.ఇదే పరిస్థితి పది రోజుల క్రితం పెనుమూరులో ఓ జ్యూస్ ఫ్యాక్టరీ వదులుతున్న వ్యర్థాల వలన చుట్టుపక్కల గ్రామ ప్రజలు కలుషితమైన నీరు వలన ఇబ్బందులు పడుతున్నట్లు ఆందోళన చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితి జిల్లాలో అత్యధిక ఫ్యాక్టరీలు వ్యర్థాలను బయటకు వదులుతున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం అనేక అనుమానాలకు దారితీస్తుంది. ఈమధ్య పాల డైరీల లో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల స్థితిగతులను అధ్యయనం చేయగా అనేక కార్మిక చట్టాలు వర్తించకుండా కార్మికుల నుండి దోపిడీ చేస్తున్న పరిస్థితి కూడా పాల డైరీల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నారని వెలుగులోకి వచ్చింది. ఒకటి రెండు చట్టాలు వర్తింపజేసి మేము అన్ని రకాల చట్టాలు అమలు చేస్తున్నాయని చెప్పుకుంటున్నాయా తప్ప ఆచరణలో ఆ విధంగా చేయడం లేదని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు అన్ని పరిశ్రమల వద్ద వ్యర్థాలను వలన ఇబ్బంది కలిగే వాటిపై చర్యలు తీసుకోవాలని కార్మిక చట్టాలు ప్రకారం కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని వారి డిమాండ్ చేశారు లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.ఈ పరిశీలనలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి గిరిధర్ గుప్తా, సిఐటియు నాయకులు రాజా, మహిళా సంఘం జిల్లా నాయకురాలు జయంతి తదితరులు పాల్గొన్నారు.

# షిరిడిలో సాయినాథునికి నృత్య నీరాజనం



**గూడూరు, పెన్ పవర్,ఆగస్టు 5:** గూడూరు శ్రీ సాయి నృత్య బృంద అకాడమీ ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని షిరిడి శ్రీ సాయిబాబా సంస్థాన్‌లో నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం భక్తి పారవశ్యాన్ని నింపింది. నాట్యాచారిణి పి. శైలజ కుమారి శిక్షణలో అకాడమీకి చెందిన చిన్నారులు భరతనాట్యం, భక్తి నృత్యాలను ప్రదర్శిస్తూ సాయినాథునికి నృత్య నీరాజనం సమర్పించారు. షిరిడి సాయి సంస్థాన్ ఆహ్వానం, సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు సంప్రదాయ వేషధారణలో అద్భుత నృత్య ప్రదర్శనలతో భక్తులను అలరించారు. సాయిబాబాపై భక్తి, భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాగిన నృత్యాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల హావభావాలు, లయబద్ధమైన అడుగులు, భావప్రకటనలకు ప్రేక్షకులు కరతాళధ్వనులతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాట్యాచారిణి పి. శైలజ కుమారి మాట్లాడుతూ, షిరిడి వంటి పవిత్ర క్షేత్రంలో తమ అకాడమీ విద్యార్థులకు ప్రదర్శన చేసే అవకాశం లభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. భరతనాట్యం ద్వారా భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు చేరవేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ అరుదైన అవకాశాన్ని కల్పించిన షిరిడి సాయి సంస్థాన్ పాలకవర్గం, అధికారులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సాయినాథుని ఆశీస్సులతో విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా మరింత కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న చిన్నారులను జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు.

# గూడూరులో విజయవంతమైన ఏబీవీపీ కళాశాలల బంద్

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, విద్యార్థి సమస్యల పరిష్కారానికి డిమాండ్



**గూడూరు, పెన్ పవర్,ఆగస్టు 5:** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్ గూడూరులో బుధవారం విజయవంతమైంది. బంద్‌కు మద్దతుగా పట్టణంలోని పలు ప్రైవేట్ కళాశాలలు ముందుగానే సెలవు ప్రకటించాయి. ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలను ఏబీవీపీ నాయకులు సందర్శించి యాజమాన్యాలతో చర్చించగా, వారు కూడా బంద్‌కు సహకరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ గూడూరు నగర కార్యదర్శి శివచరణ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నప్పటికీ కళాశాల విద్యార్థులకు సంబంధించిన రూ.6,800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. అలాగే జీవో నెం.77ను రద్దు చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించడం, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం, కార్పొరేట్ విద్యా మాఫియాపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బంద్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఏబీవీపీ నాయకులు పట్టణంలోని పలు కళాశాలలను సందర్శించి బంద్‌ను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు సామంత్, హేమంత్, విఘ్నేష్‌తో పాటు పలువురు విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10 దేశవ్యాప్త నిరసన

## జైల్ భరో విజయవంతం చేయండి : వెంకటసుబ్బయ్య.




**గుంటూరు,పెన్ పవర్,ఆగస్టు 5 :** ఆగస్టు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించనున్న దేశవ్యాప్త నిరసన, జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. బుధవారం గుంటూరులోని కొత్తపేట ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్ సభ్యుల సమావేశం జిల్లా అధ్యక్షుడు రావుల అంజిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టనున్న జైల్ భరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, అన్ని పంటలకు ఉత్పత్తి ఖర్చుపై 50 శాతం కలిపి గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.31 వేలు అమలు చేసి లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి రోజుకు రూ.700 కనీస వేతనం చెల్లించాలని, పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఏఐటీయూసీ గుంటూరు జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడుతూ...ఆగస్టు 10న నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అన్నవరపు ప్రభాకర్, కోట మాల్యాద్రి, చల్లా చిన ఆంజనేయులు, ఆకిటి అరుణ్ కుమార్, పుప్పాల సత్యనారాయణ, రాజు, తుంగ బాలస్వామి, కోట్ల మరియాదాస్, బొట్టు శీను పాల్గొన్నారు.

# హిందూ దేవతలపై అసభ్యవ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలుతీసుకోవాలి : బీజేపీ నేతల ఫిర్యాదు





**గుంటూరు, పెన్ పవర్ , ఆగస్టు 5 :** సోషల్ మీడియాలో హిందూ దేవతలు, హిందూ ధర్మం, హిందూ సంప్రదాయాలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు ఆంధ్రప్రదేశ్ డీజీపీ (సైబర్ సెక్యూరిటీ) రవిశంకర్ అయ్యనార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ నేతృత్వంలో టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, సీనియర్ నాయకుడు శ్రీనివాస రాజు, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు సునీల్ రెడ్డి, షేక్ బాజీ తదితరులు డీజీపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వల్లూరు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పేరుతో కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా దేవతలను, ధర్మాన్ని అవమానించడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో హిందూ ధర్మంపై ద్వేష ప్రచారం చేస్తున్న ఖాతాల వెనుక ఉన్న నిధుల మూలాలు, వారికి ఆర్థిక సహాయం చేస్తున్న వ్యక్తులు లేదా సంస్థలపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. డీజీపీ (సైబర్ సెక్యూరిటీ) రవిశంకర్ అయ్యనార్ ఫిర్యాదును స్వీకరించి, చట్ట పరిధిలోకి వచ్చే ప్రతి ఒక్కరిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు వెల్లడించారు. దేశంలో ప్రతి మతాన్ని గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని, ఏ మత విశ్వాసాలను అవమానించే వారిపైనా ప్రభుత్వం రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ డిమాండ్ చేసింది.

# అతి తక్కువ ఫీజుతో జర్నలిజం డిప్లొమా కోర్సు : సి.ఆర్. మీడియా అకాడమీ

**విజయవాడ, పెన్ పవర్,ఆగస్టు 5 :** జర్నలిజం రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు అతి తక్కువ ఫీజుతో డిప్లొమా ఇన్ జర్నలిజం కోర్సును ఆంధ్రప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ తెలిపారు. ఈ కోర్సు ప్రధానంగా వర్కింగ్ జర్నలిస్టుల కోసం రూపొందించినప్పటికీ, జర్నలిజంపై ఆసక్తి ఉన్న డిగ్రీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పే లక్ష్యంతో ఈ కోర్సును రూపొందించామని ఆయన తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్స్ మాజీ ప్రొఫెసర్, ప్రస్తుతం ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి ఆధ్వర్యంలో వివిధ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లతో కూడిన బోర్డు ఆఫ్ స్టడీస్ ఈ కోర్సును రూపొందించిందన్నారు. ఎలక్ట్రానిక్, ప్రింట్, సోషల్ మీడియా రంగాల్లో ఉన్నత ప్రమాణాలతో పనిచేసే సామర్థ్యాన్ని ఈ కోర్సు ద్వారా అభ్యర్థులు పొందగలరని తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ మాజీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ పి. బాబీ వర్ధన్ కోర్సు డైరెక్టర్‌గా, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ కె. జోతిర్మయి యూనివర్సిటీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఆరు నెలల కాలవ్యవధి గల ఈ కోర్సుకు రిటైర్డ్ అధ్యాపకులు, సీనియర్ జర్నలిస్టులు ఆన్‌లైన్ విధానంలో



తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు రెండు తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. కోర్సు ముగింపు సమయంలో అసైన్‌మెంట్లు, పరీక్షల ఆధారంగా ఫలితాలు ప్రకటించి, ఉత్తీర్ణులకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డిప్లొమా సర్టిఫికెట్లు జారీ చేస్తుందని వెల్లడించారు. వర్కింగ్ జర్నలిస్టులు రూ. 2,000 డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటు అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి దరఖాస్తు పంపాలని, ఇతర అభ్యర్థులు రూ. 2,500 డిమాండ్ డ్రాఫ్ట్‌తో డిగ్రీ సర్టిఫికెట్‌ను జతచేయాలని సూచించారు. దరఖాస్తులను సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ, 40-6/4-8, 4వ అంతస్తు, రెవెన్యూ కాలనీ, మొగల్రాజపురం, విజయవాడ -- 520010 చిరునామాకు పంపాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 20 చివరి తేదీ కాగా, సెప్టెంబర్ మొదటి వారంలో తరగతులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.

# ఆగస్టు 17 నుండి 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్' నిషేధాన్ని కఠినంగా అమలు చేయలి : కమిషనర్ కె.మయూర్ అశోక్ .

**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 05,** బుధవారం వార్డ్ సచివాలయాల వారీగా ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు, ప్రజారోగ్య అధికారులు, కార్మికులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి డిప్యూటీ కమిషనర్లు, హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్‌వైజర్లతో 'టాస్క్ ఫోర్స్ కమిటీ' ని ఏర్పాటు చేశామన్నారు.





ఆగస్ట్ 17 తర్వాత ఈ కమిటీ నగరంలో ప్లాస్టిక్ తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలు మరియు వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తుందన్నారు. ప్రత్యేక బృందాలతో నగరవ్యాప్తంగా గోడౌన్లు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాలు మరియు వీధి వ్యాపారుల వద్ద తనిఖీలు నిర్వహించడం, నిషేధిత ప్లాస్టిక్ కనిపిస్తే వెంటనే ఆ సరుకును జప్తు చేసి, 'స్వచ్ఛ గుంటూరు యాప్' ద్వారా ఉల్లంఘనదారులపై అక్కడికక్కడే భారీ జరిమానాలు విధిస్తారన్నారు. నిబంధనలు పదే పదే ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే, ప్రజలు మరియు వ్యాపారుల్లో అవగాహన కల్పించేందుకు అన్ని వార్డుల్లో ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా, యువజన సంఘాలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లతో సమావేశాలు నిర్వహించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే ప్రమాదాలు, ప్రత్యామ్నాయాలపై అవగాహన కల్పిస్తారన్నారు. కనుక నగర ప్రజలు, వ్యాపార వాణిజ్య సంస్థల ప్రతినిధులు ఆరోగ్యకరమైన, ప్లాసిక్ నిషేధిత గుంటూరు నగర సాకారానికి సహకరించాలని కోరారు.

# బీసీ రక్షణ బిల్లు-2026పై సమన్వయ సమావేశం

### విజయవాడలో ప్రజాప్రతినిధులతో ప్రభుత్వం విస్తృత చర్చలు

### పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 05 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముసాయిదా ఆంధ్రప్రదేశ్ బీసీ రక్షణ బిల్లు-2026పై సమన్వయ సమావేశం బుధవారం విజయవాడలోని ఫార్చ్యూన్ మురళి పార్క్ హోటల్‌లో నిర్వహించింది. బిల్లును తుది రూపు దిద్దే ముందు ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలు సేకరించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవితతో పాటు మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు, శాసనసభ బీసీ సంక్షేమ కమిటీ సభ్యులు, వెనకబడిన తరగతులకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. నరసరావుపేట శాసనసభ్యులు, శాసనసభ బీసీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు కూడా సమావేశంలో పాల్గొన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి (టీడీపీ--జనసేన--బీజేపీ) ఇచ్చిన హామీల్లో భాగంగా రాష్ట్రంలోని 138 బీసీ కమ్యూనిటీల హక్కులు, ఆత్మగౌరవం, ఆస్తులు, జీవితాలకు చట్టపరమైన రక్షణ కల్పించాలనే లక్ష్యంతో ఈ బిల్లును ప్రభుత్వం రూపొందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం తరహాలో బీసీలకు ప్రత్యేక రక్షణ కల్పించే చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ చట్టం అమల్లోకి వస్తే దేశంలో ఇలాంటి చట్టాన్ని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవనుంది.



ముసాయిదా బిల్లులో కులం లేదా సంప్రదాయ వృత్తి పేరుతో అవమానించడం, వేధించడం, సామాజిక లేదా ఆర్థిక బహిష్కరణ వంటి 15 రకాల అఘాయిత్యాలను శిక్షార్హ నేరాలుగా చేర్చే ప్రతిపాదనలు ఉన్నాయి. నేర తీవ్రతను బట్టి ఆరు నెలల నుంచి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అంశాలను కూడా ముసాయిదాలో పొందుపరిచినట్లు సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీఓఎం), మంత్రివర్గ ఉపసంఘం పలుమార్లు సమావేశమై ముసాయిదాను రూపొందించగా ఇటీవల న్యాయశాఖ కూడా దీనిపై తన అభిప్రాయాన్ని వెల్లడించింది. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా ముసాయిదా ఉందని పేర్కొంటూనే అవసరమైన అంశాలపై జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ అభిప్రాయాన్ని కూడా తీసుకోవాలని సూచించినట్లు సమావేశంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేసిన అనంతరం బిల్లుకు తుది రూపు ఇచ్చి, రానున్న శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం, జాతీయ బీసీ కమిషన్‌కు పంపనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. బీసీ వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక భద్రతకు చట్టబద్ధమైన రక్షణ కల్పించే దిశగా ప్రభుత్వం విస్తృత స్థాయిలో సంప్రదింపులు కొనసాగిస్తోందని సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

# స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించిన జి.ఎ.డి ముఖ్య కార్యదర్శి, జె. శ్యామల రావు





**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 5 :** రాజధాని పెరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై జి.ఎ.డి ముఖ్య కార్యదర్శి జె. శ్యామల రావు బుధవారం పెరేడ్ గ్రౌండ్స్ లో సమీక్షించారు. పెరేడ్ గ్రౌండ్స్ లో జరుగుతున్న ఏర్పాట్లను సి.ఆర్.డి.ఏ కమిషనర్ విజయరామ రాజు, జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్, పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ లు ఏ.భార్గవ తేజ, కొల్లాబత్తుల కార్తీక్, అభిషేక్ లతో కలసి పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, న్యాయాధికారులు, అఖిల భారత సర్వీసుల అధికారులు తదితరులు వచ్చే మార్గాలను, వారికి కేటాయించే స్థలాలను పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ ఆహ్వానాల ముద్రణ, పంపిణీపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పెరేడ్ ఏర్పాట్లు పక్కా ఉండాలని అన్నారు. వేల సంఖ్యలో సాధారణ ప్రజానీకం హాజరు అయ్యే అవకాశాలు ఉంటాయని, అందుకు తగిన విధంగా కూర్చునే ప్రదేశాలు, తాగు నీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు దృష్టిలో పెట్టుకోవాలని చెప్పారు. పార్కింగ్ ప్రదేశం, వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ ప్లాన్ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలు తమ ప్రగతిని ప్రదర్శించే శకటాలుహౌతయారీ పూర్తి చేయాలని, 13వ తేదీన జరిగే తుది రిహార్సల్స్ లో పూర్తి స్థాయిలో ప్రదర్శన చూపాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ.కిషోర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ లు సి.హెచ్.రమేష్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్ - 2026కు ఘన శ్రీకారం

### విద్యార్థులతో వాలీబాల్ ఆడి క్రీడా పోటీలను ప్రారంభించిన పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్






**పెన్ పవర్, కృష్ణాజిల్లా, ఆగస్టు 05 :** "ఆరోగ్యం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి ఉన్నప్పుడే జీవితంలో నిజమైన విజయం సాధించగలం" అని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. కంకిపాడు మండలం పునాదిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన 'అమరావతి ఛాంపియన్‌షిప్--2026' నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడి ఉత్సాహంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో దేహదారఢ్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణను పెంపొందిస్తాయని, విద్యార్థి దశలో అలవర్చుకునే ఆరోగ్యకరమైన జీవనశైలే భవిష్యత్ విజయాలకు బలమైన పునాది అవుతుందని అన్నారు. ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, ఇంజనీర్, లాయర్ వంటి ఉన్నత స్థానాలు సాధించినా ఆరోగ్యం సరిగా లేకపోతే వాటికి విలువ ఉండదని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి ప్రతిరోజూ వ్యాయామం, యోగా, ఈత లేదా ఏదో ఒక క్రీడను జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. పేద కుటుంబాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కష్టపడి చదివి, క్రమశిక్షణతో ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన సన్నబియ్యంతో పౌష్టికాహారం అందిస్తున్నామని, భోజనం నాణ్యతలో ఏవైనా లోపాలు కనిపిస్తే తల్లిదండ్రులు వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. క్రీడా పోటీల్లో పాల్గొంటున్న ప్రతి విద్యార్థి గెలుపు--ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీపడి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పుటూరు హోమియో వైద్యశాలకు వచ్చే రోగులకు ఆధార్, ఫోన్ నంబర్ తప్పనిసరి

**పర్చూరు, పెన్ పవర్,ఆగస్టు 5:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు బాపట్ల జిల్లాలోని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాలలో 'ఆయుష్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్' ద్వారా రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు, జిల్లా ఆయుష్ ఆటిజం సెల్ నోడల్ అధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆసుపత్రి ప్రాంగణంలో



నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, చికిత్స కోసం వచ్చే ప్రతి రోగి తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ ఫోన్‌ను వెంట తీసుకురావాలని సూచించారు. ఆధార్‌కు లింక్ అయిన మొబైల్‌కు వచ్చే ఓటీపీని నమోదు చేయడం ద్వారా మాత్రమే రోగి ఆరోగ్య వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరచడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ ప్రక్రియలో ఓటీపీ చెప్పేందుకు రోగులు ఎలాంటి సందేహం లేదా సంకోచం అవసరం లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ డిజిటల్ ఆరోగ్య విధానం ద్వారా భవిష్యత్తులో దేశంలోని ఏ ఆసుపత్రికి వెళ్లినా రోగి ఆరోగ్య వివరాలను వైద్యులు ఆన్‌లైన్‌లో పరిశీలించి, మరింత సమర్థవంతమైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని డాక్టర్ దాసరి చంద్రశేఖర్ వివరించారు. వ్యాధులు వచ్చిన తర్వాత ఆసుపత్రుల చుట్టూ తిరగడం కంటే, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ఆరోగ్య అవగాహన సదస్సులు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ వీటిని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి స్వచ్ఛంద సేవకురాలు కే. నాగరాజా, వైద్యశాలకు వచ్చిన రోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ధృతి బి2 ఎక్స్‌పోకు సర్వం సిద్ధం



**గుంటూరు, పెన్ పవర్: ఆగస్ట్, 05 :** గుంటూరు అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో ఆగస్టు 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ధృతి బి2 ఎక్స్‌పో--2026కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఎక్స్‌పోలో గృహోపకరణాలు, ఫర్నిచర్, రియల్ ఎస్టేట్, హెల్త్‌కేర్, ఆటోమొబైల్స్, టెక్నాలజీ తదితర రంగాలకు చెందిన 140 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్స్‌పోలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్‌తో పాటు ఉచిత రక్త పరీక్షలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఎక్స్‌పోకు ప్రవేశం పూర్తిగా ఉచితమని, ప్రజలు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బి2 ఎక్స్‌పో కమిటీ విజ్ఞప్తి చేసింది.

## జనగణన – 2027 సన్నాహాలు ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలి : కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్,ఆగస్టు 5:** జనగణన – 2027 సన్నాహక కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేసి, జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్‌ను అత్యంత ప్రామాణిక పత్రంగా రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ నమోదు అంశంపై ఒకరోజు కార్యశాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లోని సామాజిక, ఆర్థిక, విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలపై ఖచ్చితమైన సమాచార సేకరణతోనే సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించవచ్చున్నారు. మండల స్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నాణ్యమైన సమాచారాన్ని సేకరించి, ప్రతి వివరాన్ని సంబంధిత శాఖల ద్వారా ధృవీకరించిన తర్వాతే నమోదు చేయాలని సూచించారు. జనగణన--2027 కోసం విడతల వారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అవసరమైన మార్గదర్శకాలు, ఫారాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమాచార సేకరణలో సమన్వయం, నిరంతర పర్యవేక్షణ, బాధ్యతాయుతమైన విధానంతో పనిచేస్తేనే విశ్వసనీయ గణాంకాలు సిద్ధమవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి ఉపయోగపడే ప్రామాణిక జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ రూపకల్పనకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఉత్తమ అధికారులుగా చిరస్మరణీయ సేవలు అందించాలి : కలెక్టర్ సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్టు 5 :** ప్రజల సమస్యల పరిష్కారమే అధికారుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని, నిబద్ధతతో పనిచేస్తే ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలుస్తారని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. 2026 గ్రూప్-1 బ్యాచ్‌కు ఎంపికైన యువ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులకు మంచి వైఖరి, విశాల దృక్పథం, ఫలితాలపై దృష్టి అత్యంత అవసరమన్నారు. సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపే దిశగా పనిచేయాలని సూచించారు. ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తూ వినూత్నంగా పనిచేస్తే ప్రజల గౌరవం లభిస్తుందని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటీడీఏలో పనిచేసిన అనుభవాలను పంచుకున్న ఆయన, గిరిజన విద్యార్థులకు 'సూపర్-60' కార్యక్రమం ద్వారా ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు కల్పించడం, "మాతృ దేవో భవ" కార్యక్రమంతో మాతృ మరణాలను గణనీయంగా తగ్గించడం సంతృప్తినిచ్చిన అంశాలుగా పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలను కుటుంబ జీవితంతో సమతుల్యం చేసుకోవాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ యోగా వంటి అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామీణ, పట్టణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే అవకాశాలను అనుభవంగా మలుచుకోవాలని అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి వివిధ శాఖల మధ్య సమన్వయం పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మానవ వనరుల సంస్థ అధికారి శ్రీనివాస్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు

**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 05 :** పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమరావతి స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశయాలను ప్రతిబింబించే అమరావతి : బిల్ట్ బై ది పీపుల్ , సెక్యూర్డ్ బై దిష్టినీ పేరుతో రూపొందించిన పుస్తకాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు. అనంతరం విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టు పురోగతితో పాటు రాష్ట్రంలో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆధునిక రవాణా వ్యవస్థ బలోపేతానికి కేంద్రం నుంచి అవసరమైన సహకారంపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర పట్టణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రోత్సాహానికి కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కృతజ్ఞతలు తెలిపారు.



## కానిస్టేబుళ్లను సిట్ కస్టడీకి అప్పగించిన కోర్టు

### విచారణపై కీలక ఆదేశాలు

**పెన్ పవర్ ၊ విజయవాడ ၊ ఆగస్టు 05 :** సాయికృష్ణ కేసు దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు కానిస్టేబుళ్లు నాని, అశోక్‌లను బుధవారం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు అనుమతితో ఇద్దరినీ సిట్ కస్టడీకి అప్పగించింది. విచారణ సందర్భంగా కానిస్టేబుల్ నాని తనను అరెస్ట్ చేసిన సమయంలో పోలీసులు ఇబ్బందులకు గురిచేశారని న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి దర్యాప్తు అధికారిని (ఐవో) పిలిపించి నాని చేసిన ఆరోపణలపై వివరణ కోరారు. నిందితులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం విచారణ నిర్వహించాలని సిట్ అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. మరోవైపు, సీఐ నాగరాజు సిట్ కస్టడీ గడువు ముగియడంతో ఆయన్ను కూడా కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఆయనను తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు. అలాగే, కస్టడీ విచారణకు సంబంధించిన వీడియో, ఆడియో, సీసీటీవీ ఫుటేజీలను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించాలని న్యాయస్థానం సిట్ అధికారులను ఆదేశించింది.





## హాకీ, అథ్లెటిక్స్ పోటీలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్, ఆగస్ట్, 05 :** ఎన్‌టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. బుధవారం విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎంబీపీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన హాకీ, అథ్లెటిక్స్ పోటీలతో పాటు జిల్లా జట్టు ఎంపిక పోటీలను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పరిశీలించారు. క్రీడాకారులతో ముచ్చటించి పోటీలు జరుగుతున్న తీరుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్ర స్థాయిలో ఎన్‌టీఆర్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. పోటీల నిర్వహణ, క్రీడాకారులకు కల్పించిన సౌకర్యాలు, మైదాన ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ డీఎస్ఏ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోటీలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించడంతో పాటు క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి జిల్లా జట్టుకు ఎంపిక చేయడం పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో జులై 15 నుంచి ఆగస్టు 26 వరకు అమరావతి ఛాంపియన్‌షిప్--2026 పోటీలు జరుగుతున్నాయి. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, యోగా తదితర 12 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను, డీఎస్‌డీవో కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి ఛాంపియన్‌షిప్ - 2026కు ఘన శ్రీకారం

### విద్యార్థులతో వాలీబాల్ ఆడి క్రీడా పోటీలను ప్రారంభించిన పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్





**పెన్ పవర్ ၊ కృష్ణాజిల్లా ၊ ఆగస్టు 05 :** "ఆరోగ్యం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి ఉన్నప్పుడే జీవితంలో నిజమైన విజయం సాధించగలం" అని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. కంకిపాడు మండలం పునాదిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన 'అమరావతి ఛాంపియన్‌షిప్--2026' నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడి ఉత్సాహంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో దేహదారఢ్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణను పెంపొందిస్తాయని, విద్యార్థి దశలో అలవర్చుకునే ఆరోగ్యకరమైన జీవనశైలే భవిష్యత్ విజయాలకు బలమైన పునాది అవుతుందని అన్నారు. ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, ఇంజనీర్, లాయర్ వంటి ఉన్నత స్థానాలు సాధించినా ఆరోగ్యం సరిగా లేకపోతే వాటికి విలువ ఉండదని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి ప్రతిరోజూ వ్యాయామం, యోగా, ఈత లేదా ఏదో ఒక క్రీడను జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. పేద కుటుంబాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కష్టపడి చదివి, క్రమశిక్షణతో ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన సన్నబియ్యంతో పౌష్టికాహారం అందిస్తున్నామని, భోజనం నాణ్యతలో ఏవైనా లోపాలు కనిపిస్తే తల్లిదండ్రులు వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. క్రీడా పోటీల్లో పాల్గొంటున్న ప్రతి విద్యార్థి గెలుపు--ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీపడి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చీరాలలో నేతన్నలకు రూ.75 వేల ఆర్థిక సాయం విడుదల చేయాలి

### : కరణం వెంకటేష్ బాబు



**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 5 :** చీరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన నేతన్న నేస్తం పథకం ద్వారా రాష్ట్రంలోని సుమారు 84 వేల చేనేత కుటుంబాలకు ఐదేళ్ల పాటు ఒక్కో కుటుంబానికి సంవత్సరానికి రూ.24 వేల చొప్పున నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసి చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించారని తెలిపారు. అయితే, కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచార సమయంలో చీరాలలో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి చేనేత కుటుంబానికి ప్రతి ఏడాది రూ.25 వేల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు నేతన్నలకు ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని విమర్శించారు. రాబోయే జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గత రెండేళ్ల బకాయితో పాటు ప్రస్తుత సంవత్సరానికి కలిపి మొత్తం రూ.75 వేల ఆర్థిక సహాయాన్ని ప్రతి చేనేత కుటుంబానికి విడుదల చేసి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కరణం వెంకటేష్ బాబు డిమాండ్ చేశారు.

## ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ ఫార్మేషన్ డేలో కృష్ణా డీసీసీబ్యాంక్‌కు రికగ్నిషన్ ఆఫ్ ఎక్సలెన్స్' అవార్డు



**విజయవాడ, పెన్ పవర్, ఆగస్టు 5 :** ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ ఫార్మేషన్ డే వేడుకల్లో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (కృష్ణా డీసీసీ బ్యాంక్) ప్రతిష్ఠాత్మక రికగ్నిషన్ ఆఫ్ ఎక్సలెన్స్" అవార్డును అందుకుంది. 2025--26 ఆర్థిక సంవత్సరంలో రూ.15 వేల కోట్లకు పైగా వ్యాపార పరిమాణం నమోదు చేసి అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు ఈ అవార్డును ప్రదానం చేశారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ డ సహకార శాఖ కార్యదర్శి బాబు.ఏ, ఐఏఎస్, అపకబ్ చైర్మన్ గన్నె వీరాంజనేయులు, మేనేజింగ్ డైరెక్టర్ వి. రామకృష్ణ చేతుల మీదుగా కృష్ణా డీసీసీ బ్యాంక్ చైర్మన్, మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురాం అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా నెట్టెం శ్రీ రఘురాం మాట్లాడుతూ, ఈ అవార్డు డైరెక్టర్ల మండలి, సీఈఓ, అధికారులు, ఉద్యోగులు, పీఏసీఎస్ ప్రతినిధులు, సభ్య రైతుల సమిష్టి కృషికి లభించిన గౌరవమని తెలిపారు. రైతులకు మరింత పారదర్శకమైన, సాంకేతిక ఆధారిత బ్యాంకింగ్ సేవలు అందిస్తూ సహకార రంగంలో కృష్ణా డీసీసీ బ్యాంక్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో 13 జిల్లాల డీసీసీబీ చైర్మన్లు, కృష్ణా డీసీసీ బ్యాంక్ సీఈఓ శ్యామ్ మనోహర్, బ్యాంకు ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## చంద్రబాబు రెండేళ్లలోనే జగన్ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెట్టారు : ప్రత్తిపాటి

### కూటమి ప్రభుత్వం సుదీర్ఘకాలం అధికారంలో ఉంటేనే రాష్ట్రం నంబర్1 స్థానంలో ఉంటుంది

### చిలకలూరిపేట మండలం గొట్టిపాడు, ఈపూరివారిపాలెం, దండమూడి గ్రామాల్లో ఇంటింటికీ తెలుగుదేశంలో ప్రత్తిపాటి



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఆగస్టు 05:** బుధవారం ఆయన చిలకలూరిపేట మండలం గొట్టిపాడు, ఈపూరివారిపాలెం, దండమూడి, మిట్టపాలెం, నాగభైరువారిపాలెం, గ్రామాల్లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత గొట్టిపాడులో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న మెటల్ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి, అనంతరం ఈపూరివారిపాలెంలో రూ.10 లక్షలతో ఏర్పాటుచేసిన గ్రావెల్ రోడ్డును ప్రారంభించి, అనంతరం గొట్టిపాడు గ్రామానికి చెందిన తుమ్మలగుంట మరియమ్మ అనారోగ్య కారణం వల్ల ముందస్తు చికిత్స నిమిత్తం 4.5 లక్షల రూపాయల విలువైన ఎల్ ఓ సి నీ అందజేసి గ్రామస్తుల్ని ఉద్దేశించి మాట్లాడారు. దండమూడిలో ప్రజలతో మాట్లాడిన ప్రత్తిపాటి.. రెండేళ్ల కూటమిపాలన , అభివృద్ధి, సంక్షేమంపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

**వైకుంఠపాళి ఆడకుండా రాష్ట్ర హితాన్ని దృష్టిలో పెట్టుకోవాలి:** జగన్ విధ్వంసం నుంచి తక్కువ కాలంలోనే చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిన పెట్టారని, కూటమి ప్రభుత్వం సుదీర్ఘకాలం అధికారంలో ఉంటేనే, ప్రజలకు... రాష్ట్రానికి ఎనలేని మేలు కలుగు తుందని ప్రత్తిపాటి సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు గుజరాత్ ను ఆదర్శంగా తీసుకోవాలని, అక్కడ ఒకే ప్రభుత్వం ఎక్కువకాలం అధికారంలో ఉన్నందున, దేశంలోనే నంబర్- 1గా నిలిచిందన్నారు. గతంలో మాదిరి వైకుంఠపాళి ఆడకుండా ప్రజలు ఎల్లప్పుడూ రాష్ట్ర హితాన్ని దృష్టిలో పెట్టుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. గ్రామాల్లో ఇంకా మౌలిక వసతులు చేపట్టాల్సి ఉందని, నిధుల కొరత వల్లే ప్రభుత్వం సకాలంలో ప్రజలు కోరిన అభివృద్ధిని అందించలేకపోతోందన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కూటమి పార్టీలకు తిరుగులేని విజయం అందించాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, బీజేపీ నేతలు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, టీడీపీ నాయకులు అంబటి సోంబాబు, జాకోబు రాజు, చిగురుపాటి రాజా, చిన్నం రవి, గొట్టిపాటి బాబు, చెన్నంశెట్టి సాంబశివరావు, కనపర్తి సుబ్బారావు, పద్మ, కృష్ణ, ప్రవీణ్, తాళ్లూరి సాంబశివరావు, శివప్రసాద్, దండ శ్రీనివాసరావు, కొత్త మోహనరావు, నాగభైరు శివరాం, నాగభైరు ఆంజనేయులు, ధూళిపాళ్ల శ్రీనివాసరావు, ఈపూరి బ్రహ్మానందం, మద్దాల వెంకట ప్రసాద్, మద్దాల స్వామి, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేమవరం గ్రామంలో శ్రీ కొండలమ్మ అమ్మవారికి విరాళం

**గూడూరు, పెన్ పవర్, ఆగస్టు 5 :** వేమవరం గ్రామంలో వేంచేసి ఉన్నటువంటి శ్రీ కొండలమ్మ తల్లి అమ్మవారి దేవస్థానం నందు ఆషాడ మాసం సందర్భంగా కొంతమంది విరాళాలు ఇచ్చిన దాతలు గూడూరు మండలం రామన్నపేట గ్రామానికి చెందినటువంటి రామన్నపేట పి.ఎ.సి.ఎస్. అధ్యక్షులు మురాల ధనేష్ 60 కుర్చీలు విరాళంగా ఇచ్చి ఉన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఈడే మోహన్ రావు, కొండలమ్మ తల్లి అమ్మవారి ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు దాతలు పాల్గొన్నారు.



## మీడియేషన్ తో కేసులకు సత్వర పరిష్కారం



**మచిలీపట్నం, పెన్ పవర్, ఆగస్టు 5 :** జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ పిలుపుమేరకు "మీడియేషన్ ఫర్ నేషన్–3.0" కార్యక్రమంలో భాగంగా కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుట్టల గోపి ఆధ్వర్యంలో బుధవారం మచిలీపట్నంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కోర్టు నుంచి సాయిబాబా సెంటర్ వరకు సాగిన ర్యాలీలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది, పోలీసు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి గుట్టల గోపి మాట్లాడుతూ, రాజీ పడదగిన కేసులను మీడియేషన్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల ఇరు పక్షాలకు ప్రయోజనం చేకూరడంతో పాటు సమయం, ధనం ఆదా అవుతాయని తెలిపారు. కృష్ణా జిల్లాలో 99 మంది శిక్షణ పొందిన మీడియేటర్లు సేవలందిస్తున్నారని చెప్పారు. అనంతరం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియేషన్ అవేర్నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు జి. వెంకటేశ్వర్లు, సీహెచ్. దుర్గా పూర్ణిమ, టి. రాజా వెంకట్రాది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్. వరలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తుంగల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆలపాటి ఇకపై టీడీపీ పక్షాన ప్రజలకోసం పనిచేస్తారు : ప్రత్తిపాటి

**బీఎస్ఎన్ఎల్ ఏఈ వెంకట్రావు పదవీవిరమణ కార్యక్రమంలో ప్రత్తిపాటి.**



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 05 :** పదవీ విరమణ తర్వాత ప్రజాజీవితంలోకి రావాలన్న బీఎస్ఎన్ఎల్ మాజీ ఏఈ ఆలపాటి వెంకట్రావు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఆలపాటి వెంకట్రావు సతీమణి పద్మావతి గత 10 ఏళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీలో చేరాలన్న వారి నిర్ణయాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో జరిగిన బీఎస్ఎన్ఎల్ ఏఈ ఆలపాటి వెంకట్రావు ఉద్యోగ విరమణ సమావేశానికి ప్రత్తిపాటి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఎస్ఎన్ఎల్ సంస్థలో సుదీర్ఘకాలం పనిచేసిన వెంకట్రావు, ఇకపై తన అనుభవాన్ని, ఆలోచనల్ని ప్రజలకోసం వినియోగించాలన్న నిర్ణయం తీసుకోవడాన్ని ప్రత్తిపాటి స్వాగతించారు. ఆలపాటి దంపతులు ఇకపై పూర్తిస్థాయిలో టీడీపీలో కొనసాగుతూ... ప్రజలకోసం పనిచేస్తారని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారని చెప్పారు. ఆలపాటి వెంకట్రావు సోదరుడు ఆంజనేయులు జర్నలిజంలో విశేష సేవలందిస్తున్నారన్నారు.

## సీఎం.ఆర్.ఎఫ్ నగదు చెక్కులు పంపిణీ చేసిన ప్రత్తిపాటి

**22 మందికి రూ.22.58 లక్షల నగదుచెక్కులు అందచేసిన ఎమ్మెల్యే**



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 05 :** వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి, వైద్యసేవల నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం.ఆర్.ఎఫ్ చెక్కుల్ని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం లబ్ధిదారులకు, వారి కుటుంబసభ్యులకు అందచేశారు. మొత్తం 22 మందికి రూ.22.58 లక్షల విలువైన నగదు చెక్కుల్ని స్వయంగా అందించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి చెక్కులు పంపిణీ చేసిన అనంతరం, ప్రత్తిపాటి లబ్ధిదారులతో మాట్లాడి, వారి కుటుంబ స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు ప్రజారోగ్య రక్షణ విషయంలో ఎప్పుడూ ముందే ఉంటారని, అనారోగ్య సమస్యలతో బాధపడేవారు ఈ ప్రభుత్వంలో ఆందోళన చెందాల్సిన పనిలేదని ప్రత్తిపాటి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, కొత్త కోటేశ్వరరావు , జయప్రసాద్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వేంపల్లెలో నిబంధనలను ఉల్లంఘిస్తున్న బ్రాంది షాపులు

**తెల్లవారుజామున 5 గంటలకే తెరుస్తున్న బ్రాంది షాపులు చూసి నడనట్లు వ్యవహరిస్తున్న పోలీసు, ఎక్సైజ్ అధికారులు పులివెందుల సమన్వయ కర్త మూలం రెడ్డి ధృవకుమార్ రెడ్డి**



**వేంపల్లె - ఆగస్టు 5 :** వేంపల్లెలోని బ్రాంది షాపులు నిబంధనలను ఉల్లంఘిస్తున్న ఎక్సైజ్ అధికారులు, పోలీసులు పట్టించుకోక పోవడం చాలా దారుణమని కాంగ్రెస్ పార్టీ పులివెందుల సమన్వయ కర్త మూలం రెడ్డి ధృవకుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బ్రాంది షాపులను ఉదయ 10 గంటలకు తెరిచి రాత్రి 10 గంటలకు మూసి వేయాలని నిబంధనలను పెట్టినప్పుటికి వేంపల్లెలోని ఒక బ్రాంది షాపు కూడ నిబంధనలను పాటించడం లేదని అరోపించారు. తెల్లవారుజామున 5గంటలకు బ్రాంది షాపులు తెరిచి మద్యాన్ని విక్రయాలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు, పోలీసు అధికారులు చూసి చూడనట్లు ఉండడం గర్హనీయం అన్నారు. కూలీల రక్తాన్ని బ్రాంది షాపులు పీల్చు కోవడం సబబు కాదన్నారు. మాములు మత్తుల్లో ఎక్సైజ్ అధికారులు ఉండడంతోనే నిభంధనలను బ్రాంది షాపులు యాజమానులు యధ్దేచ్ఛంగా విక్రయాలు చేయడం జరుగుతున్నట్లు తెలుస్తున్నదని తెలిపారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారుల కన్నుల ముందే తెల్లవారుజామునే బ్రాంది షాపులు తెరుస్తున్న పట్టించుకోక పోవడం దారుణమని తెలిపారు. బ్రాంది షాపులు తెల్లవారుజామునే తెరవడం వలన మద్యానికి బానిస అయిన ప్రజలు కూలీ పనులకు కూడ వెళ్లకుండా బ్రాంది షాపుల వద్దకు వెళ్లి మద్యం సేవించి ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై పడిపోవడం జరుగుతున్నదని తెలిపారు. మద్యం షాపులు నిబంధనల మేరకు ఉదయం 10 గంటలకు మాత్రమే తెరవాలని తెల్లవారుజామున తెరుస్తే మాత్రం బ్రాంది షాపులు వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కాబట్టి పోలీసు, ఎక్సైజ్ అధికారులు స్పందించి తెల్లవారుజామునే తెరుస్తున్న బ్రాంది షాపులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# 2025 డీఎస్సీ నియమకాలపై శ్వేత పత్రం విడుదల చేయాలి.

**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.తవ్వా వెంకటయ్య.**



**కడప టౌన్ ఆగస్టు 5 :** కూటమి ప్రభుత్వం అట్ట హాసంగా నిర్వహించి, నియమించిన 2025 డిఎస్సి నియామకాలపై శ్వేత పత్రం విడుదల చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.తవ్వా వెంకటయ్య డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటికీ నుండి అనేక అంశాలలో విఫలమైందని పేర్కొంటూ సందర్భంగా పలు అంశాలను ప్రస్తావించారు. ప్రజా రాజధాని అమరావతి పేరుతో భూ దందా జరుగుతుందని ఇప్పటికే ప్రతిపక్షాలు గగ్గోలుపెడుతున్నప్పటికీ అక్కడ జరుగుతున్న పెట్టుబడుల గురించి గానీ, ప్రభుత్వ ఖర్చుల గురించి గానీ , రైతులకు ఇస్తున్న రైతుల గురించి గానీ, స్థలాల గురించి గానీ ఇంతవరకు ప్రభుత్వం స్పష్టంగా స్పందించలేదన్నారు. అమరావతిలో అవినీతి జరుగుతుందని ప్రతిపక్షాలు మేధావులు ఎంత విమర్శించినా కనీసం ఎటువంటి అవినీతి జరగలేదని చెప్పడానికి శ్వేత పత్రమైనా విడుదల చేసి పాపాన పోలేదన్నారు. అలాగే జగన్మోహన్ రెడ్డి హయాంలో తిరుమల లడ్డులో కల్తీ జరిగిందని నానా హంగామా చేసిన కూటమి ప్రభుత్వం దాని నిరూపించిందా అని ఆయన ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి పైన బురదజల్లడం తావు అధికారంలో ఉంటే ప్రజలను మభ్య పెట్టడం చంద్రబాబు నాయుడు గారికి అలవాటే అన్నారు. 2025 డీఎస్సీలో జరిగిన అక్రమాలపై ఇప్పటికే మండల, నియోజకవర్గ, రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డీఎస్సీలో అక్రమాలకు బలహీన అభ్యర్థులతో, నిరుద్యోగులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. హైకోర్టు సిబిఐ ఎంక్వయిరీ నిరాకరించిందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. కానీ ప్రభుత్వం తన చిత్తశుద్ధి నిరూపించుకోవడానికి ఎందుకు ముందుకు రావడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం డీఎస్సీలో అక్రమాలు చేసింది అనడానికి ఒకే ఒక్క నిదర్శనం ఇప్పటివరకు మెరిట్ లిస్టును విడుదల చేయకపోవడమే అన్నారు.

# డివిసి లో నోటీసులు జాప్యం

**డీవీసీలో భార్యాభర్తల సమస్యలపై నోటీసులు జాప్యం**

**పైసలిస్తేనే నోటీసులు సర్వ్ అవుతాయంటూ ఆరోపణలు**

**ఈ విమర్శలపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలంటే బాధితులు ఆరోపిస్తున్నాయి**

**కడప టౌన్ ఆగస్టు 5 :** కడప జిల్లాలోని డొమెస్టిక్ వైలెన్స్ అనగా డివిసి లో భార్యాభర్తల సమస్యలపై నోటీసులు సర్వ కావాలంటే పైసలిస్తే తప్ప సకాలంలో నోటీసులు సర్వ కావడం లేదని ఆరోపిస్తున్నారు ఎందుకంటే ఒక నోటీసు పంపించాలంటే 1500 నుండి 2000 రూపాయలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ బాధితులు ఆరోపిస్తున్నారు ఒకవేళ అలా డబ్బులు ఇవ్వలేకపోతే నోటీసులు ఆరు మాసాలైనా కూడా పంపడం లేదని తీవ్రంగా మండపడుతున్నారు ఇలా కాలయాపన చేయడం వల్ల బాధితులకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందని ఆరోపిస్తున్నారు ఎందుకంటే డబ్బు ఉన్నవారు వారు అడిగిన ప్రకారం ఇచ్చి కేసు నుండి రక్షించుకునే దానికోసం కాలయాపన చేస్తున్నారని అలా జరగడం వల్ల బాధితులకు చాలా నష్టం జరుగుతుందని ఆరోపిస్తున్నారు అంతేకా వారు అడిగిన ప్రకారం డబ్బు ఇవ్వకపోతే ఆ నోటీసులను పక్కన పడేయడం జరుగుతుందని తీవ్రంగా మండిపడుతున్నారు ఇప్పటికైనా నోటీసులు సర్వ్ చేయడంలో జాప్యం చేస్తున్నటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు అంతేకాకుండా స్వయంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఒక భాగంలో అనగా డివిసిలో డబ్బులు ఇవ్వకపోతే బాధితులకు ఎటువంటి న్యాయం జరగదని మండిపడుతున్నారు ఎందుకంటే అలా డబ్బులు ఇవ్వలేని వ్యక్తుల కేసులను పక్కనపెట్టి ఉంచడం ఏంటి అని మండిపడుతున్నారు అంతేకాకుండా డబ్బు ఇవ్వకపోతే ఆ వ్యక్తులు ఆఫీసు చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాలనా అంటూ మండిపడుతున్నారు మరి ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇలా డబ్బులు డిమాండ్ చేస్తున్నటువంటి అధికారులపై విచారణ చేపట్టి కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు

# బోరు వివాదంలో బాల సిద్ధారెడ్డి హత్య

**మైదుకూరు ప్రతినిధి ఆగస్టు 5 :** కడప జిల్లాలోని మైదుకూరు మండలంలో నిగడ్డ మరుపల్లి గ్రామంలో వ్యవసాయ బోరు వివాదంలో బాల సిద్ధారెడ్డిని హత్య చేసిన అబ్దుల్ రసూల్ అయితే అబ్దుల్ రసూల్ పొలంలో బోరుకు అతి సమీపంలో బోరు వేయడానికి బాల సిద్ధారెడ్డి సిద్ధపడ్డాడని అక్కడ బోర్ వేస్తే తన బోరులో నీరు తగ్గిపోతాయన్న కోపంతో మత్తు కత్తితో దాడి కి తెగబడ్డ అబ్దుల్ రసూల్ తీవ్ర రక్త స్రావమ్ తో అక్కడికక్కడే బాల సిద్ధారెడ్డి మృతి చెందాడు సమాచారం తెలుసుకున్న మైదుకూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు అంతేకాకుండా పరారి లో ఉన్న నిందితుని కోసం మైదుకూరు పోలీసులు గాలిస్తున్నారు



## గల్లా మాధవి ప్రజా హృదయ విజేత : ఆళ్ళ హరి



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్టు 5 :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రజా హృదయ విజేతగా నిలిచారని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి పేర్కొన్నారు. గల్లా మాధవి పుట్టినరోజు ముందస్తు వేడుకల్లో భాగంగా బుధవారం శ్రీనివాసరావుతోటలో తులసి, వేప, రావి వంటి మొక్కలను విద్యార్థులతో కలిసి నాటించారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో గల్లా మాధవి అతి తక్కువ కాలంలో శక్తివంతమైన మహిళా నాయకురాలిగా గుర్తింపు పొందారని అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజారిటీతో విజయం సాధించి ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రహదారులు, పారిశుధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటున్నారని చెప్పారు. ముఖ్యంగా మహిళల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ వ్యవస్థ ఏర్పాటు చేసి వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. జనసేన పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరు కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని ఆళ్ళ హరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అప్పిశెట్టి రంగా, జనసేన నగర కార్యదర్శి షేక్ మెహబూబ్ భాష, నాజర్ వలి, నందూరి స్వామి, అలా కాసులు, టీడీపీ నాయకులు సలువాది మనోజ్, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లిక్విడ్ గంజాయి, టపెంటడాల్ టాబ్లెట్లతో ముగ్గురు యువకుల అరెస్ట్



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 5 :** పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో లిక్విడ్ గంజాయి, టపెంటడాల్ టాబ్లెట్లు విక్రయిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 120 గ్రాముల లిక్విడ్ గంజాయి (12 డబ్బాలు), 50 టపెంటడాల్ టాబ్లెట్లు (5 స్ట్రిప్స్) స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఈస్ట్ డీఎస్పీ టి. సీతారాం పర్యవేక్షణలో పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు బాలాజీ నగర్ '0' లైన్ ఎక్స్‌టెన్షన్, రైల్వే ట్రాక్ సమీపంలో బుధవారం ఉదయం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో చావలి వెంకట శంకర్ అయ్యన్నార్ అలియాస్ చిన్నూ, చిలకల మురళీకృష్ణారెడ్డి, ఏరువ వెంకట సతీష్ ఉన్నారు. నిందితులపై ఎఫ్ఐఆర్ నెం. 222/2026 నమోదు చేసి, ఎన్డీపీఎస్ చట్టం, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఈస్ట్ డీఎస్పీ టి. సీతారాం మాట్లాడుతూ, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం, సరఫరాపై ప్రత్యేక బృందాలతో పాటు ఈగల్ టీంతో సమన్వయం చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత నేరస్తులపై నిరంతర నిఘా కొనసాగిస్తూ మాదకద్రవ్యాల నిర్మూలనకు చర్యలు మరింత వేగవంతం చేస్తామని తెలిపారు.

## కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు




**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 05 :** పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమరావతి స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశయాలను ప్రతిబింబించే అమరావతి : బిల్ట్ బై ది పీపుల్ , సెక్యూర్డ్ బై దిష్టినీ పేరుతో రూపొందించిన పుస్తకాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు. అనంతరం విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టు పురోగతితో పాటు రాష్ట్రంలో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆధునిక రవాణా వ్యవస్థ బలోపేతానికి కేంద్రం నుంచి అవసరమైన సహకారంపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర పట్టణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రోత్సాహానికి కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కృతజ్ఞతలు తెలిపారు.